క్లుప్తంగా

3న జగన్నాథుని కల్యాణ మహోత్సవాలు

కొత్తపల్లి: మూలపేటలోని బలభద్ర సుభద్ర సమేత జగన్నాథస్వామి, శ్రీదేవి భూదేవి సమేత సత్యనారాయణస్వామి మొండి జగ్గప్ప స్వామి దివ్య కల్యాణ మహోత్సవలు ఈ నెల 3వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ విషయాన్ని జగన్నాథస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.

భువనేశ్వరి పీఠంలో పూజలు



గోపిశర్మ సిద్ధాంతిని సత్కరిస్తున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక వర్జులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి 56వ జన్మదిన వేడుకల్లో భాగంగా భక్తులు అమ్మవారికి పూజలు చేసి ఆయనను ఘనంగా సత్కరించారు. పురం వెంకటరత్నం, పాలకుర్తి సతీష్, చార హనుమాన్‌శర్మ, రాము శర్మ, ఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రెండో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని అందుకున్న విద్యార్థులతో కోచ్

సామర్లకోట: విశాఖపట్నం శిల్పారామంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సామర్లకోటకు చెందిన కరాటే పాఠశాల విద్యార్థులకు పలు పతకాలు లభించాయి. కోచ్, ఏపీ సౌత్ జోన్ కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి. శంకరరావు మంగళవారం సాయంత్రం స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి తమ విద్యార్థులు 128 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని, ఒక బంగారు, నాలుగు రజత, 10 కాంస్య పతకాలు లభించాయని చెప్పారు. ఈ పోటీల్లో కాకినాడ జిల్లాకు రెండో చాంపియన్ ట్రోఫి లభించడం ఆనందంగా ఉన్నదని శంకరరావు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని అచ్చంపేట ఫ్లైఓవర్ వద్ద మంగళవారం సాయంత్రం మోటారు సైకిలును వ్యాన్ ఢీకొంది. దాంతో మోటారు సైకిలుపై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని వివరాలు తెలియాల్సి ఉన్నదని పోలీసులు తెలిపారు.

రెండు మోటారు సైకిళ్లు దగ్ధం



కాలిపోయిన స్కూటీ, టీవీఎస్ మోపెడ్

సామర్లకోట: స్థానిక బళ్ల మార్కెట్ భీమవరపుపేటలో నిలిపి ఉంచిన స్కూటీ, టీవీఎస్ మోపెడ్‌లు సోమవారం అర్ధరాత్రి కాలి బూడిద అయ్యాయి. భీమవరపుపేటకు చెందిన దూలపల్లి రాజు, పి అప్పలరాజు రోడ్డుపై మోటారు సైకిళ్లను ప్రతి రోజులానే పెట్టారు. అయితే అర్ధరాత్రి 12 గంటల సమయంలో మోటారు సైకిళ్లు కాలి పోతున్నట్లు స్థానికులు గమనించారు. అప్పటికే రెండు మోటారు సైకిళ్లతో పాటు సమీపంలో ఉన్న మరో మోటారు సైకిల్ పాక్షికంగా దెబ్బతింది. దూలపల్లి రాజు తన స్కూటీలో ఉంచిన రూ.50వేల నగదు కాలి బూడిదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



సీతారామాలయంలో ధ్వజస్తంభ మేఖలాలను ప్రతిష్ఠిస్తున్న ధర్మకర్తలు

బోట్‌క్లబ్: స్థానిక ప్రతాప్‌నగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని జగన్మోహన సీతారామాలయంలో మంగళవారం ధ్వజసంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త వంగూరి శ్రీనివాసు మాట్లాడుతూ 1972 ఆలయంలో నిర్మించారని, ధ్వజస్తంభం మేఖలాలు పాడవడంతో దాతల సహకారంతో కొత్తవి పునఃప్రతిష్ఠ చేసినట్లు చెప్పారు.

మంచినీటి కష్టాలు ఆరంభం

- తగ్గిపోయిన నాగార్జున చెరువు మట్టం
- ముందుచూపు లేని అధికారులు
- వేసవి ప్రారంభంలోనే సరఫరాలో కోత



సామర్లకోట నాగార్జున ఫిల్టర్ చెరువులో తగ్గిన నీటిమట్టం



రిజర్వాయర్‌లోని నీటిని శుద్ధి చేసే ఫిల్టరు ప్లాంటు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు గోదావరి జలాలను తాగునీరుగా అందించడానికి 2000 సంవత్సరంలో ఉండూరు రైల్వే గేటు వద్ద ఫిల్టరు బెడ్‌ప్లాంటును ఏర్పాటు చేశారు. దీనికోసం ఉండూరు గేటు వద్ద ఉన్న నాగార్జున చెరువులో సామర్లకోట మున్సిపాలిటీకి కొంతమేరకు నీటిని వాడుకునే అవకాశం ఇచ్చారు. అయితే ఈ చెరువులో నీటిని నింపే బాధ్యత మాత్రం పూర్తిస్థాయిలో మున్సిపల్ అధికారులే తీసుకొంటున్నారు. రోజు 77 లక్షల లీటర్ల నీటిని అందజేసే సామర్థ్యం ఈ ప్లాంటుకు ఉన్నా ఉపయోగించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మూడు మీటర్ల నీటిమట్టం ఉంటే నెలరోజుల పాటు నీటి ఎద్దడి ఉండదని అధికారులు తెలియజేస్తున్నారు. 3.50 మీటర్ల నీరు ఉంటే చెరువు పూర్తిగా నిండుతుంది. ప్రస్తుతం 1.50 లీటర్ల నీటిమట్టం ఉంది. దాంతో నీటిఎద్దడి ప్రారంభం అయింది. ఫిల్టర్ బెడ్‌లో పంపులు పాడైపోవడం తాగునీటి సమస్యకు కారణంగా చెబుతున్నారు. ఈ చెరువులో నీటిని నాగార్జున ఫ్యాక్టరీ యాజమాన్యం ఎక్కువ వాడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. దాంతో నాగార్జున ఫ్యాక్టరీకి వెళ్లే నీటిని నిలిపి వేశారు. సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 60వేల జనాభా ఉండగా ప్రతి మనిషికి కనీసం 100 లీటర్లు నీటిని ఇవ్వవలసి ఉంది. దాంతో 60 లక్షల లీటర్ల నీరు ఇవ్వవలసి ఉండగా మున్సిపాలిటీ మాత్రం 50 లక్షల లీటర్ల నీటిని మాత్రమే ఇస్తోందనే లెక్కలు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 12,500 వరకు ఇళ్లు ఉండగా సుమారు ఆరు వేల వరకు ఇంటి కుళాయిలు ఉన్నాయి.

అధికారులు స్పందించకపోవడమే కారణమా?

ఈ చెరువులో ప్రస్తుతం ఉన్న నీటిని రెండు నెలల పాటు వాడుకోవలసి ఉంది. ఈ చెరువులో కాకినాడ నాగార్జున ఫ్యాక్టరీకి కూడా వాటా ఉన్నందున అది కూడా వాడుకుంటుంది. వేసవి కాలం ప్రారంభానికి ముందే మున్సిపల్ అధికారులు చెరువులో నీటిని నింపుకునే ప్రయత్నం చేయవలసి ఉండగా స్పందించడంలేదనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు 23ఏళ్ల నాటి పంపులు పాడై పోవడంతో వాటిని మార్చక పోవడం వలన సమస్య ఉందంటున్నారు. పంపులను మార్పు చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మంచినీటి చెరువులో చేపల వేట లేకుండా చూడాలని కొన్నేళ్లుగా కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఏలేరు జలాలతో చెరువు నింపాలి



గోదావరి కాలువలో నీటి మట్టం తగ్గి పోవడంతో ఫిల్టరు చెరువులోనికి నీరు వచ్చే అవకాశం లేదు. దాంతో వేసవి కాలం ప్రారంభంలోనే తాగునీటి నీటి ఎద్దడి ఏర్పడుతోంది. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఏలేరు ప్రాజెక్టు జలాలను తాగునీటి చెరువులోనికి వచ్చే విధంగా చేయాలి. అదేవిధంగా పంపులను వెంటనే మార్పు చేయాలి.

– ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ సామర్లకోట

అధికారుల దృష్టికి తీసుకు వెళతాం



గోదావరి కాలువలో నీటి మట్టం పెంచాలని కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. ఏలేరు ప్రాజెక్టు జలాలతో గోదావరి కాలువను నింపితే సమస్య పరిష్కారం అవుతుంది. ఫిల్టర్ ప్లాంటులో పంపులు మార్పు చేస్తాం.

– నయీం అహ్మద్, కమిషనర్, సామర్లకోట

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్యసేవలందించిన డాక్టర్ కార్తీక్‌ను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కరప: షుగరు, బీపీ పేషంట్లు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహా మేరకు ఆరోగ్యనియమాలు పాటిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని మెడికవర్ హాస్పటల్ డాక్టర్ కార్తీక్ సూచించారు. గురజానపల్లిలో ఆదివారం కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు. గురజానపల్లి గ్రామస్తుడు, కాకినాడ మైత్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్నాసుల శివకుమార్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు బృందాలుగా ఏర్పడి రెండు రోజుల పాటు 965 మందికి షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించగా 235 మందికి పలు వ్యాధులున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. వైద్యసేవలందించిన డాక్టర్ సతీష్, ఇతర సిబ్బందిని గ్రామస్తుల తరపున లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. లయన్స్‌క్లబ్ కాకినాడ స్టార్స్ ప్రెసిడెంట్ సీహెచ్ గణేష్‌ప్రసాద్, సెక్రటరీ గరికిపర్తి నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

74 వాహనాల వేలం



వాహనాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస్

కాకినాడ క్రైం: మద్యం, సంబంధిత కేసుల్లో పట్టుబడ్డ పలు వాహనాలను జిల్లా పోలీస్ శాఖ సెబ్ సంయుక్త ఆధ్వర్యంలో వేలం వేశారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో 74 వాహనాలను రూ.10.87 లక్షలు మొత్తానికి పాడుకున్నారు. ఇందులో జీఎస్టీ విలువ రూ.1.5 లక్షలని అధికారులు తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణిలో మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీవారి పుష్కరిణి మధ్యలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంపై కలశ స్థాపన చేసి, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కలశాల ఊరేగింపు, చతుర్వేద పారాయణం, యాగశాలార్చన, హోమం, యంత్ర ప్రతిష్ఠ, రత్నన్యాసం, పిండికాన్యాసం, నివేదన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు. సాయంత్రం యాగశాలారాధన, మూలమంత్ర తదితర సేవలు నిర్వహించారు. లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



గొల్లప్రోలులో విలియమ్స్ హోవే చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

పిఠాపురం: అంతర్జాతీయ టైలర్స్ డేను మంగళవారం పిఠాపురం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలులో జై గణేశా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కుట్టు మెషీన్ సృష్టి కర్త విలియమ్స్ హో చిత్ర పటానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు జైగణేషా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు బత్తుల కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణ పరిధిలో టైలర్స్ డేను మంగళవారం నిర్వహించారు. స్థానిక తిలక్‌చౌక్ సెంటర్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో టైలర్స్ యూనియన్ నాయకుడు కొలాటి తాతాజీ అధ్యక్షతన సమావేశమై కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి సాగర్, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక బట్టల బజార్‌లో టైలర్స్ విలియమ్స్‌హూవే విగ్రహానికి నివాళులు అర్పించారు.

కొత్తపల్లి: ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో మంగళవారం టైలర్స్ డేను నిర్వహించారు. మండల భార్గవ టైలరింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్ సృష్టికర్త విలియం హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీచ్ రోడ్డు సెంటర్లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



సామర్లకోటలో విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దర్జీలు



ఉప్పాడలో విలియం హోవే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టైలర్లు

జాబ్ మేళాలో 223 మందికి ఉద్యోగాలు



మెగా జాబ్ మేళాలో మాట్లాడుతున్న అధికారులు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో కాకినాడ జిల్లా ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 223 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొనగా 445 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో వివిధ కంపెనీలలో వివిధ కేటగిరిలలో 223 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శాంతి, సీడప్ జేడీఎం కేశవరావు, జిల్లా ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు, కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.సంజీవరావు, ఏపీ ఎస్ఎస్‌డీసీ, సీడాప్, ఎంప్లాయిమెంట్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లోకి వెళ్లాలనే ఆకాంక్ష నెరవేర్చారు



బొమ్మి ఇజ్రాయిల్‌ను సత్కరించిన నాయకులు

సామర్లకోట: గత 75 ఏళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి మాదిగలు చట్ట సభలోకి వెళ్లాలనే ఆకాంక్ష ఎట్టకేలకు సీఎం జగన్ నెరవేర్చారని మాదిగ ఆత్మ గౌరవ, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లూరి నాని అన్నారు. మంగళవారం స్థానిక ఇస్మాయిల్ నగర్‌లో మాదిగ నాయకుల సమావేశంలో నాని పాల్గొన్నారు. కోనసీమ జిల్లాకు చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ మేరకు మంగళవారం గోడి గ్రామంలో ఇజ్రాయిల్‌ను కలిసి సత్కరించినట్టు నాని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు చిడిపి స్టాలిన్, మండపల్లి రవి, కొల్లి చైతన్య, కాకినాడ జిల్లా నాయకులు నందిక చక్రం, వేళంగి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి మేధస్సుకు సైన్స్ దోహదం



శ్రీ ప్రకాష్‌లో సీవీ రామన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంతానం, మూర్తి తదితరులు

పెద్దాపురం: ప్రతి విద్యార్థి శాస్త్రవిజ్ఞానంపై మక్కువ ఏర్పరచుకోగలిగితే మేధస్సును సాధించవచ్చని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా మంగళవారం పెద్దాపురం మండలం కాండ్రకోట జెడ్పీ హైస్కూల్‌ల్లో ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థుల ప్రయోగాలను ఆయన పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో..

స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అకడమిక్ కో–ఆర్డినేటర్ అసిత్‌కుమార్ రాయ్‌లు మాట్లాడుతూ సీవీ రామన్ జన్మదినాన్ని జాతీయ సైన్సు దినోత్సవంగా ప్రటించారన్నారు. తొలుత పాఠశాల ఆవరణలో సీవీ రామన్ విగ్రహానికి నివాళులర్పించారు. పాఠశాల అకాడమిక్, కల్చరల్ కో–ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వీర్రాజు హైస్కూల్‌లో సైన్సు డే వేడుకలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారానే శాస్త్రీయ ఆలోచన ప్రారంభం అవుతుందన్నారు. జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జీఎస్‌హెచ్ ప్రభాకర్ వర్మ, జిల్లా కల్చరల్ కమిటీ కన్వీనర్ ఎస్.కన్నబాబు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సవివరంగా సమాధానాలిచ్చారు. బి.శివశంకర్, బి.అనంతరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలని అన్నారు. సైన్సు పటాలతో విద్యార్థులు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టు కున్నాయి. సైన్సు క్విజ్, ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీనియర్ సైన్సు టీచరు ఏఎల్‌వీ కుమారి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాసు, కె శేషారత్నం, సీహెచ్ లక్ష్మీదుర్గ, సీహెచ్ భద్రమ్మ, జి బాల, శైలజలు సైన్సు ప్రాధాన్యతను వివరించారు. పీడీ తాళ్లూరి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రతిభ స్కూల్‌లో కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్ ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు నిర్వహించారు.

అబ్బుర పరచిన పిల్లల ప్రయోగాలు

పిఠాపురం: నియోజకవర్గంలోని గొల్లప్రోలు, పిఠాపురం మండలాలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లోనూ మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ ప్రయోగాలు అబ్బుర పరిచాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్సు డేను పురస్కరించుకుని ప్రసంగిస్తున్న జేవీవీ నాయకుడు ప్రసాద్



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేసిన సాయిరామకృష్ణ



గొల్లప్రోలు బాలికల పాఠశాలలో విద్యార్థినుల ప్రదర్శన

బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమర్ ఆలీషా



మౌల్వీ డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: స్వాతంత్య్ర సమర యోధునిగా, మహాకవిగా, సంఘ సంస్కర్తగా, వేదాంత వేత్తగా మౌల్వీ డాక్టర్ ఉమర్ ఆలీషా కీర్తి ప్రతిష్టలు సంపాదించారని సభాధ్యక్షుడు అహ్మద్ ఆలీషా అన్నారు. మంగళవారం కాకినాడ బోట్‌క్లబ్ వద్ద గల కవిశేఖర్ డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద ఆయన జయంతి నిర్వహించారు. ప్రస్తుత పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా, ఆయన సోదరుడు అహ్మద్ ఆలీషా అధ్యక్షత వహించగా, మరొక సోదరుడు హుస్సేన్‌షా, అహ్మద్ ఫజల్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎవీవీ సత్యనారాయణ వేదికపై ప్రసంగించారు. అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ వందేళ్ల క్రితం అజ్ఞానం, మూఢ నమ్మకాలను తరిమికొట్టి సమాజాన్ని సంస్కరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమర్ ఆలీషా అన్నారు. ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్‌షా, సత్యనారాయణ తదితరులు ఆయన రచనలు, స్త్రీజనోద్ధరణపై మాట్లాడారు. సభా నిర్వాహకుడు పేరూరి సూరిబాబు మాట్లాడుతూ ఆయన రాసిన పద్మావతి అనే నవలను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు నాన్‌డీటెయిల్డ్‌గా 45 ఏళ్ల క్రితమే డిగ్రీ కళాశాలలో పాఠ్య పుస్తకాలుగా ప్రకటించారన్నారు. అమృతవల్లి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఆచరణాత్మక సూచనలతో, అనర్గళంగా ప్రసంగించిన మహా మహుడు ఉమర్ ఆలీషా అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ ఆలీషా కేక్ కట్ చేసి పంచారు. పిఠాపురం విశ్రాంత పెన్షనర్ల సంఘం సభ్యులు, పురుహూతికా లలితకళా పరిషత్ నిర్వాహకుడు ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలసిన వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రామకృష్ణ

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పంపన రామకృష్ణ మంగళవారం ఎమ్మెల్యే ద్వారంపూడిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. పార్టీ పటిష్టతకు, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నాయకులు ఆర్జి సూర్యారావు, శీరం ప్రసాద్, గోపి, వానపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.